క్లుప్తంగా

పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామనీ... తక్షణమే పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికవర్గం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 8 గంటల పని విధానం రూపొందించుకుందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 8 గంటల పని విధానానికి చెల్లు చీటీ రాసి కార్పొరేట్లకు అనుకూలంగా పని గంటల్లో మార్పు తీసుకురావటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్పొరేట్ శక్తుల కళ్లల్లో ఆనందం కోసమే కార్మిక హక్కులను పణంగా పెట్టటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పోటీ పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు నాలుగైదు గంటలు అదనంగా కార్మికులచే పని చేయిస్తున్నారనీ, దాన్ని చట్టబద్ధం చేస్తూ కార్పొరేట్ భక్తిని ప్రభుత్వాలు చాటుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను హరించే చట్టసవరణలు, విధాన నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలనీ లేకుంటే సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్దెత్తున పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

'షైనింగ్ స్టార్స్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి, నగదు పురస్కారం అందించేందుకు ఈనెల 9న సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కలెక్టర్ బంగ్లా నుంచి విద్యాశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువుగా వెలసిల్లిన శ్రీరాట్నాలమ్మకు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో ఉన్న శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలోని అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుముల ద్వారా రూ.54,070, విరాళాల ద్వారా రూ.15,326, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.21,990, పులిహోర అమ్మకం ద్వారా రూ.3,150, ఫొటోల అమ్మకం ద్వారా రూ.3,245 ఆదాయం లభించగా, మొత్తం ఆదాయం రూ.94976 లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు.

రోడ్లపై పశువుల సంచారం

- పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



తంగెళ్ళమూడి ప్రాంతంలో రోడ్లపైనే సంచరిస్తున్న ఆవులు



వంతెన ఫుట్‌పాత్‌పై సేద తీరుతున్న ఆవులు

ఏలూరు (టూటౌన్): నగరంలోని రోడ్లపై పశువుల సంచారం విరివిగా ఉంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఏ రోడ్డులో చూసినా ఆవులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పలువురు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రోడ్లపై ఇష్టానుసారం ఆవులను వదిలేస్తున్న వాటి యజమానులను గుర్తించి వారికి నోటీసులు ఇస్తే కొంత వరకు పరిస్థితి అదుపులోకి తీసుకురావచ్చనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఆవులు రోడ్లపైనే ఆవాసాలు ఏర్పాటుచేసుకుని ఉండటంతో తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అవి ఒక్కసారిగా లేచి పొడుచుకోవడం, కుమ్ముకోవడం వంటివి చేస్తుండటం వల్ల ఒక్కోసారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో ఈ ఆవుల వల్ల బైకులపై ప్రయాణించే వారు ప్రమాదానికి గురవుతున్నారు. ఒక పక్క రోడ్లపై ఆవుల సంచారం కారణంగా నగర ప్రజలు ఇక్కట్లు పడుతుండగా మరో పక్క ఆవులు సైతం అనారోగ్యం పాలవుతున్నాయి. రోడ్లపై ఉన్న చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్‌ను ఇష్టానుసారంగా తినటం వల్ల ఆవులు పెద్ద ఎత్తున అనారోగ్యం పాలవుతున్నాయి.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం

నగరంలోని రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా సంచరించడంపై నగర ప్రజలు పలు మార్లు నగరపాలక సంస్థకు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు మండి పడుతున్నారు. గతంలో వినియోగదారుల ఫోరంలో సైతం దీనిపై ఫిర్యాదు చేయగా వినియోగదారుల ఫోరం నగరపాలక సంస్థకు నోటీసులు ఇవ్వడం వంటివి సైతం జరిగినట్లు చెబుతున్నారు. అయినా దీనిపై చర్యలు చేపట్టక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెబుతున్నారు.

చర్యలు చేపట్టాలి



నగరంలోని రోడ్లపైకి విచ్చలవిడిగా ఆవులను వదిలేస్తున్న యజమానులు గుర్తించి వారికి నగరపాలక సంస్థ నోటీసులు జారీ చేయాలి. అయినా మాట వినని వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలి. ఆవులు రోడ్లపై సంచరిస్తుండటం వల్ల ఇటు ప్రజలకు.. అటు ఆవులకు ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ఆవులను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, టీకేఎంయూ అధ్యక్షుడు, ఏలూరు

తరచూ ప్రమాదాలు



నగరంలోని వీధుల్లో ఇష్టానుసారంగా ఆవులు సంచరిస్తుండటం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్ఆర్‌పేట, పవరుపేట, వన్‌టౌన్, ఎన్ఆర్‌పేట, తంగెళ్ళమూడి, అశోక్ నగర్ ఇలా ఒకటేంటి ప్రతి ప్రాంతంలోనూ ఆవుల సంచారం ఎక్కువగా కన్పిస్తోంది. వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

– జి.గోపి, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మండలంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరంలోని పవర్‌పేట, పాత బస్టాండు, గూడ్స్‌షెడ్ రోడ్డు, వసంతమహల్ సెంటర్, వైఎంహెచ్ఏ హాలు, మెయిన్ బజారు, చందన బ్రదర్స్ రోడ్డు, తూర్పువీధి, పడమర వీధి, దక్షిణపు వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా విజయకుమార్ రాజు



విజయకుమార్ రాజు

దెందులూరు: ఏలూరు రూరల్ మండల తహసీల్దార్‌గా ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ రెవెన్యూ స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి విజయకుమార్ రాజు నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం కలెక్టర్ వెట్రిసెల్వి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసులు దెందులూరు తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా, దెందులూరు సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రియదర్శిని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఏపీ రైతు సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతం తగ్గించటం, పామాయిల్ గెలల ధర తగ్గిపోయి రైతులు దారుణంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముడి పామాయిల్ దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని కోరారు. అయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనలు విరమించుకోవాలని చెప్పారు. పెదవేగిలో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు ఉన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దుదాం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపు



క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందిస్తున్న కలెక్టర్ , ఎస్పీ

దెందులూరు: మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను మార్చడమే లక్ష్యమని, ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అందించారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలోని ఆశ్రమ్ ఆసుపత్రిలోని క్రీడామైదానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని 1972, 14446 టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయవచ్చన్నారు. విద్యతో పాటు క్రీడల పట్ల కూడా యువత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల వలన శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, అంతేకాక డ్రగ్స్ వంటి దుర్వ్యసనాలకు లోను కాకుండా ఉండేందుకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయడానికి, వాటి వినియోగం నివారించడానికి ఈగిల్ టీంలు, పోలీసు శాఖ సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీల్లో మొదటి స్థానం పొందిన పోలీసు టీం , రెండవ స్థానం పొందిన జ్యుడీషియల్ టీం, మూడవ స్థానం పొందిన రెవెన్యూ టీం క్రీడాకారులకు బహుమతులను కలెక్టర్, ఎస్పీలు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వీ విశ్వేశ్వరరావు, డీఎస్‌డీఓ బీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: మండలంలోని తెల్లంవారిగూడెంలో గ్రామదేవత గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బాలరాజు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు అనిపెద్ది విశ్వనాథశర్మ పూజా కార్యక్రమాలను జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు దంపతులు కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఫారెస్ట్ రేంజర్ పరామర్శ

దెందులూరు: గుడివాకలంకలో వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్ట్ హెల్పర్లు నాగన్న, సహదేవుడును ఆదివారం ఏలూరు ఫారెస్ట్ రేంజర్ విజయలక్ష్మి సిబ్బంది పరామర్శించారు. కాగా హెల్పర్లను ఢీ కొట్టిన వాహనం డ్రైవర్‌ను ఏలూరు రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు రూరల్ ఎస్సై దుర్గ ప్రసాద్ తెలిపారు.

నారసింహునికి పంచామృతాభిషేకాలు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ముందుగా ఆలయంలో అర్చకులు, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధనను నిర్వహించారు. ఆ తరువాత వేద మంత్రోచ్చరణల నడుమ సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలను జరిపారు. ఆ తరువాత గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలు, నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ఆఖరిలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఆవరణలో జరిగిన అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పలువురు కోరారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దాతలు గ్రామానికి చెందిన యూఎస్ఏలో ఉంటున్న పిన్నమరాజు సూర్యచంద్ర సత్యనారాయణ రంగ వర ప్రసాద్ రాజు, హైదరాబాద్‌కు చెందిన సుభాష్ వర్మ ఆర్థిక సాయంతో దాట్ల విజయరామరాజు చేతుల మీదుగా దివ్యాంగులకు సన్నబియ్యం, పౌష్టికాహారం , పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంతెన సుబ్బరాజు, సత్యనారాయణరాజు, పేరిచర్ల కేశవ రాజు, నంబూరి బాబులు రాజు, సరిపల్లి రామకృష్ణంరాజు, నల్లపురాజు ఆంజనేయరాజు, విఘ్నేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన 'బాలు పాట – బాలల నోట'



రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ మల్లికార్జున్‌ను సత్కరిస్తున్న ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలు పాట – బాలల నోట అనే కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఆదివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జున్ పాల్గొని మాట్లాడారు. ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు అనేక చలనచిత్రాలకు సంగీత విభాగంలో పని చేయడమే కాక వేలాది మందికి సుమారు 40 వాద్య సంగీతాల్లో శిక్షణ ఇచ్చి అత్యుత్తమ కళాకారులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వివిధ చలనచిత్రాల్లో ఆలపించిన గీతాలను ఎస్‌పీఎస్ ఈశ్చంద్, పలువురు బాలలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులకు వీనులవిందు చేశారు. అలాగే ఎస్‌పీఎస్ వాసు రచించి సంగీతం సమకూర్చిన బాలు గానామృతం గీతాన్ని అకాడమీ విద్యార్థులు మధురంగా వినిపించారు. అనంతరం ముఖ్య అతిథి మల్లికార్జున్‌ను ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర్, లంకా వెంకటేశ్వర్లు, ఆలపాటి నాగేశ్వరరావు, వై.అర్జునరావు పాల్గొనగా అకాడమీ డైరెక్టర్ వహిదా వాసు పర్యవేక్షించారు.

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జె.లలిత

వేలేరుపాడు: స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్కీమ్ వర్కర్ల రాష్ట్ర నాయకురాలు జె.లలిత, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నాయిగుట్ట గ్రామంలో స్కీమ్ వర్కర్ల మండల సదస్సును వెంకటేశ్వరమ్మ, రేవతిల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళలు, స్కూల్ స్వీపర్‌ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలన్నారు. స్కీంలో పనిచేసే మహిళా కార్మికులకు, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో స్కీం వర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం అనంతరం స్కీం వర్కర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొలురి సైదా, కోకన్వీనర్లు సీహెచ్ రమాదేవి, కె.వెంకటలక్ష్మి, కె.కుమారి, సీతామహాలక్ష్మి, డి.రేవతిలను ఎన్నుకున్నారు. అలాగే మరో 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి గౌరవ సలహాదారుగా కారం ధారయ్యను నియమించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీయూసీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజమ్మ పాల్గొన్నారు.

గోడ కూల్చివేత అభ్యంతరకరం

దెందులూరు: ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ ప్రహరీ గోడ కూల్చివేత తీవ్ర అభ్యంతరకరమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం రాత్రి చల్లచింతలపూడి బస్టాండ్ సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలు హుందాగా చేయాలే తప్ప కక్షపూరిత ధోరణితో ఇళ్లను ధ్వంసం చేయడం, గోడలు కూల్చడం, అక్రమ కేసులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అండగా నిలుస్తారని, ఎవ్వరూ అధైర్యపడొద్దని చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు వేమన నాగరాజు, బైగాన్ని అంకాలు, బి.రాంపండు, ములకాల రామకృష్ణ, మోదుగమూడి బాబి, ఎం.శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయంతో లాభసాటి



సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ లలితా సుధ

భీమడోలు: వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించి, సుస్థిరమైన లాభసాటి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని ఏలూరు ఏడీఏ లలితసుధ అన్నారు. భీమడోలు సచివాలయం నంబర్–1 వద్ద ఆదివారం రైతులు, కౌలు రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు భీమడోలు ఏవో ఎస్‌పీఎల్ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ లలితాసుధ, వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి, పెదవేగి ప్రధాన శాస్త్రవేత్త రామచంద్రుడు, ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపును తట్టుకునే వరి వంగడాలైన ఎంటీయూ 1312, 1318, 1310, 1229 రకాల గురించి రైతులకు వివరించారు. తద్వారా వర్షాలు, ఇతర చీడపీడల నుంచి వరి పంటను రక్షించుకొనేందుకు ఈ వంగడాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందడం ఖాయమన్నారు. ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతారన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, వార్డు సభ్యుడు జక్కంశెట్టి లక్ష్మణ్, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	48	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	46
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	128
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	10
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	02
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	03
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	37
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.40	98507	37
ఏలూరు - తిరుపతి	16.00	4830	34